ప్రజాశక్తి
శనివారం 1 ఫిబ్రవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు

రైల్వే ప్రాజెక్టులకు నిధులు వచ్చేనా?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌పై వివిధ తరగతుల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి రాజధాని అమరావతికి నిధుల కేటాయింపు అంశంతోపాటు రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై కూటమి నాయకులు ఎదురుచూస్తున్నారు. గతేడాది కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్ల రుణంగా కేటాయించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రుణం ఇప్పించేందుకు కేంద్రం మధ్యవర్తిగా వ్యవహరించనుంది. 15 ఏళ్ల వ్యవధిలో తిరిగి చెల్లించే ఈ మొత్తాన్ని గ్రాంటుగా ఇవ్వాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ కోరాయి. కూటమి నాయకులు మాత్రం రుణం అయినా పర్వాలేదులే ముందు నిధులు వస్తే నిర్మాణాలు చేయవచ్చునని వారికి వారే సమాధాన పర్చుకున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతికి కేటాయించే నిధుల విషయంలో మరికొంత సమాచారం బడ్జెట్ ప్రతిపాదనల్లో ఉంటుందా లేదా అన్న అంశంపై ఆసక్తి ఏర్పడింది. రాజధాని అమరావతికి నూతన రైల్వే లైను, అవుటర్ రింగ్ రోడ్డు,అమరావతి-బెంగుళూరు జాతీయ రహదారి నిర్మాణం తదితర అంశాలు కూడా ప్రతిపాదనల్లో ఎంత వరకు ప్రాధాన్యత ఇస్తారనేదీ చర్చనీయాంశంగా మారింది.



బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిచ్చినట్టు చెప్పినా పంటలకు మద్దతు ధర కల్పించేందుకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకోవడం లేదని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ఏమైనా తాయిలాలు ప్రకటిస్తారా అని ఆయా సంఘాల కార్మిక నాయకులు ఎదురుచూస్తున్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పిఎఫ్ ఖాతాదారుల పింఛన్ల పెంపుపై కూడా జిల్లాకు చెందిన దాదాపు లక్ష మంది ఎదురుచూస్తున్నారు. మరోవైపు వేతన జీవులకు సంబంధించి ఆదాయపు పన్ను మినహాయింపు పెంపుపై ప్రభుత్వ ఉద్యోగ వర్గాలు, మధ్య తరహా పరిశ్రమల దారులు వేచి ఉన్నారు.

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను పనులు మందగమనంగా సాగుతున్నాయి. 216 ఒంగోలు -కత్తిపూడి జాతీయ రహదారి విస్తరణ, రేపల్లే-బందరు నూతన రైల్వే లైను నిర్మాణంపై ప్రతిపాదనలపై బడ్జెట్‌లో ప్రాధాన్యత ఉంటుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం పెండింగ్‌లటో ఉన్న నల్లపాడు-బీబీనగర్ రైల్వే లైను విస్తరణ, విద్యుద్దీకరణ, గుంటూరు-గుంతకల్లు రైల్వే లైన్లపై నిధులు కేటాయింపుపై ఇంకా అధికారులు పంపిన ప్రతిపానదనలకు ఆమోదంపై ఆసక్తి నెలకింది. రైల్వేలకు సంబంధించి గత పదేళ్లలో వందేభారత్ రైళ్లు క్రమంగా పెంచుతూ సాధారణ రైళ్లలో జనరల్ బోగీలు, స్లీపర్ బోగీలు తగ్గింపుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు రైలు ప్రయాణం భారంగా మారింది.



తెనాలిలో జాతాకు స్వాగతం చెబుతున్నబాబూప్రసాద్

అప్పలతో కాదు హక్కులతో రాజధానిని అభివృద్ధి చేయాలి

- కేంద్రం అమరావతికిచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలి
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ
- సిపిఎం రాష్ట్ర మహాసభలకు నెల్లూరు తరలి వెళ్లిన రాజధాని జాతా - అడుగడుగునా ఘన స్వాగతం

5 లో

హైదరాబాద్‌కు గుంటూరు రాజకీయం

- కొనసాగుతున్న క్యాంపు రాజకీయాలు
- టిడిపి, వైసిపి కార్పొరేటర్లతో వేర్వేరు శిబిరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను టిడిపి, వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ ఏర్పడింది. ఫిబ్రవరి 3న సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 6 స్థానాలకు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో 56 కార్పొరేటర్లు ఉండగా వైసిపి నుంచి 46, టిడిపి నుంచి 9 మంది, జనసేన నుంచి ఇద్దరు గెలుపొందారు. వైసిపి నుంచి ఎన్నికల ముందు, ఆ తరువాత 15 మంది టిడిపిలోకి, నలుగురు జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం 27కి పెరిగింది. వైసిపి బలం 29కు తగ్గింది. అంతేగాక మరికొంత మంది వైసిపిని వీడి టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రచారం ఊపందుకోవడంతో అప్రమత్తమైన వైసిపి నాయకులు వీరిని ప్రత్యేక బస్సులో గురువారం సాయంత్రం నుంచి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ రాత్రికి 2లో



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం ఉద్యమ స్ఫూర్తితో కృషి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, పల్నాడు జిల్లా కార్యదర్శి వి.కృష్ణయ్య, గుంటూరు విజయ్‌కుమార్ పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలుపే లక్ష్యంగా సిపిఎం, ప్రజాసంఘాలు కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్-6 పథకల అమలులో కూటమి ప్రభుత్వం క్లీన్‌బౌల్డ్ దిశగా వెళ్తోందని, కొత్తగా ప్రజలపై పన్నుల భారానికి మరో 20 పత్రాలను సిద్ధం చేసుకుందని విమర్శించారు. పెట్టుబడుల కోసమంటూ దావోస్ వెళ్లినా తెచ్చింది గాని, ఒప్పందాలు కుదర్చిందిగానీ ఏమీ లేదన్నారు. గత ప్రభుత్వం కుంభకోణాల్లో మునిగిపోగా ఈ ప్రభుత్వం మాయ మాటలు, గ్రాఫిక్స్‌తో మాయ చేస్తోందని ఎద్దేవ చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ అమరావతికి బిజెపికి చిల్లిగవ్వ ఇవ్వకుండా అ పార్టీని నెత్తిన పెట్టుకుని టిడిపి, జనసేన మోస్తున్నాయని, ఈ నేపథ్యంలో లక్ష్మణరావు గెలుపు కోసం ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని అన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు కె.హనుమంతరెడ్డి, జి.బాలకృష్ణ, జి.ఉమశ్రీ, రజిని, మల్లీశ్వరి, దుర్గాబాయ్, నాగమ్మబాయ్, టి.మహేష్, బి.మహేష్, హనుమంతరావు, సిలార్ మసూద్, రబ్బాని, టిశ్రీను, హనుమంతరావు, కె.కోటేశ్వర రావు, శ్రీనివాసరెడ్డి, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


గుంటూరు నగర శివారు ఏటుకూరు - ప్రత్తిపాడు రోడ్డు శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు గాయపడ్డారు. మృతులు కుర్నూతలకు చెందిన పత్తి మిల్లు కార్మికుడు బలరాం (34), ఏసీ కాలేజీ పీజీ విద్యార్థి దావీదు (22), మరో ముఠా కార్మికుడు గోవర్ధన్ (20)గా గుర్తించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. నల్లపాడు సిఐ వంశీధర్ ఘటనా స్థలిని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళగిరి సమీపంలోని ఎన్నారై వై జంక్షన్ నేతన్న సర్కిల్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనిఒకరు మృతి చెందారు.



ఏటుకూరు వద్ద ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న సిఐ

విధుల్లోకి మిర్చి యార్డు ప్రత్యేక కార్యదర్శి చంద్రిక

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు మిర్చి యార్డు ప్రత్యేక కార్యదర్శిగా ఎ.చంద్రిక శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన వీరాంజనేయులు రాజమండ్రికి బదిలీ అయ్యారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న చంద్రిక డిప్యూటేషన్‌పై ఇక్కడ నియమించారు. యార్డులో రైతులకు అన్ని సౌకర్యాలు సమకూస్తామని, రైతులకు ఆహార పానియాలు, వసతిలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని చంద్రిక చెప్పారు. మిర్చి వ్యాపారంలో అక్రమాలను లేకుండా చూస్తామని, అమ్మకం సందర్భంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.



నరసరావుపేటలో జాతాకు స్వాగతం పలుకుతున్న సిపిఎం శ్రేణులు

4 లో

నిర్వాసితులను విస్మరించిన ప్రభుత్వాలు

- హెలికాప్టర్లలో కాదు.. గిరిజనులతో ఉంటే సమస్యలు తెలుస్తాయి
- పోలవరం నుండి వచ్చిన జాతాకు పల్నాడులో ఘన స్వాగతం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వై.వి.ఆంజనేయులు, తదితరులు

మార్చి 12, 13 తేదీల్లో చలపతిలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఐఎస్‌పిఒఆర్ ఇండియా-అమరావతి చాప్టర్, ఫార్మకాలజీ విభాగం, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం సంయుక్తంగా మార్చి 12, 13 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు తెలిపారు. ట్రాన్స్ఫార్మింగ్ ఫార్మాసుటికల్ సైన్సెస్ అండ్ ఫార్మకో ఎకనామిక్స్ త్రూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సు కరపత్రాలను శుక్రవారం కళాశాలలో వై.వి.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, వివిధ విభాగాధిపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ సదస్సు తాజా అనువర్తనాలు, వినూత్న పరిశోధనలు, నిజజీవిత అధ్యయనాలను చర్చించేందుకు ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ సెమినార్‌లో ప్రఖ్యాత ప్రపంచ నిపుణుల ప్రాముఖ్యమైన కీలక ప్రసంగాలు, ఆలోచనాత్మక ప్యానెల్ చర్చలు, సాంకేతిక సెషన్లు, ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు ఉంటాయన్నారు. హెర్బ్స్ అండ్ మోర్ లిమిటెడ్, కెన్యా, క్వెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, మలేషియా, కింగ్ సాల్మన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, ఈజిప్ట్ దేశాల నుండి ఫార్మా రంగానికి సంబంధించిన ప్రముఖులు హాజరవుతారన్నారు. అన్ని ఫార్మా, ఇతర జీవశాస్త్ర విద్యార్థులు, అన్ని శాఖల అధ్యాపకులు, పరిశోధకులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు పాల్గొనవచ్చన్నారు. ఈ సదస్సులో పాల్గొనదలచిన వారు chalapathipharmacy.in వెబ్‌సైట్‌ను సందర్శించి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు.

హైదరాబాద్‌కు గుంటూరు రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌కు చేర్చారు. స్టాండింగ్ కమిటీకి వైసిపి తరుపున నామినేషన్ దాఖలు చేసిన అడకా పద్మావతి కూడా టిడిపిలో చేరడం వైసిపి నాయకులు షాక్‌కు గురయ్యారు. ప్రస్తుతం వైసిపి నుంచి ఐదుగురు అభ్యర్థులు మాత్రమే ఉండగా టిడిపి నుంచి ఏడుగురు పోటీలో ఉన్నట్టయింది. మొత్తం ఆరు పోస్టులకు గాను టిడిపి, వైసిపి నుంచి చెరి ఆరుమందికి ఓటు వేయాల్సి ఉండగా వైసిపి నుంచి బరిలో ఉన్న అడకా పద్మావతి కూడా టిడిపిలో చేరడం వల్ల వైసిపి ఐదుగురే బరిలో ఉన్నారు. టిడిపి, వైసిపి మధ్య బలబలాలు దాదాపుగా సమానంగా ఉండటంతో ఎవరికి వారు తమ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు. ప్రధానంగా వైసిపి నుంచి గతవారం రోజుల్లో ఆరుగురు కార్పొరేటర్లు టిడిపిలోకి వెళ్లడం వల్ల ఆ పార్టీ నాయకులు అప్రమత్తమయ్యారు. అయితే టిడిపి, జనసేన కూటమి కార్పొరటర్లు కూడా మరో బస్సులోనే హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. సోమవారం స్టాండింగ్ కమిటీ ఎన్నికల తరువాత కార్పొరేషన్‌లో అనూహ్య పరిణామాలు జరుగుతాయని టిడిపి నాయకులు చెబుతున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల తరువాత మార్చిలో మేయర్‌పై అవిశ్వాసం పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామని, పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు నిర్ణయం తీసుకుంటామని నాయకులు చెబుతున్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ పిడుగురాళ్ల మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా 15 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కడియం రోహిత్ ఆనంద్, కార్యదర్శిగా సిద్ధి లక్ష్మణ్, ఉపాధ్యక్షునిగా వందనం, సహాయ కార్యదర్శిగా షేక్ యాసిన్ ఎన్నిక య్యారు. జిల్లా కన్వీనర్ కె.సాయికుమార్ మాట్లాడుతూ పిడుగురాళ్ల ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలి, ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రారంభించాలి, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మూడు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం ఎంఇఒను కలిసి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమిస్తామన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం బీఎస్సీ, బీకాం (కంప్యూటర్స్) 3వ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. బీఎస్సీ ఫిజిక్స్‌లో ఎస్.వీరకవిత 850 మార్కులకు 822 మార్కులు, ఎస్.అలేఖ్య 810, బీఎస్సీ బోటనీలో వై.వెంకట నాగలక్ష్మి 803, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో కె.శివనాగ నిఖిల 802, బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో షేక్.మీరా 791, బీఎస్సీ కెమిస్ట్రీలో రూతు శివ హెప్సిబా 789, బీఎస్సీ డేటాసైన్స్‌లో పి.రాజేశ్వరి 774, బీఎస్సీ మాథ్స్‌లో వి.వెంకట నాగమల్లేశ్వరి 650 మార్కులకుగాను 604 మార్కులు సాధించారని చెప్పారు. బీకాం కంప్యూటర్స్‌లో షేక్ కరిష్మా బేగం 800 మార్కులకుగాను 747 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కె.సతీష్‌బాబు, డైరెక్టర్లు కె.నాసరయ్య, కె.వీరరాఘవులు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

ఎంఎఎం విద్యార్థినులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేశానుపల్లిలోని ఎంఎఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 4వ ఏడాది కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు బెంగుళూరుకు చెందిన బహుళ జాతి కంపెనీ వి స్టాండ్ ఫర్ యు సొల్యూషన్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు వచ్చాయని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య శుక్రవారం తెలిపారు. ఏడుగురు కంప్యూటర్ సైన్స్, ఒకరు ఎలక్ట్రానిక్స్ విభాగం నుండి ఉద్యోగాలు సాధించారని చెప్పారు. వీరికి వార్షిక వేతనం రూ.4 వస్తుందని కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ ఎం.శేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సాదినేని రామారావు, ప్లేసెమెంట్స్ ఆఫీసర్ జె.రవిశంకర్, విభాగాదిపతులు రాధికా, ఫణిబాబు, సితార, నవీన్, అధ్యాపకులు అభినందించారు.

అంతర్జాతీయ కళా ప్రదర్శనలో వర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కళా ప్రదర్శనలో ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల జాతీయస్థాయిలో కెమిల్ ఫౌండేషన్, కర్ణాటక యూనివర్సిటీ లోని డిపార్ట్మెంట్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఆర్ట్ క్యాంపు అండ్ ఎగ్జిబిషన్ లో ఏఎన్ యు విద్యార్థులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఎంపిక చేసిన 120 మంది కళాకారులు ఐదు రోజులు హార్ట్ క్యాంప్ లో చిత్రించిన చిత్రాలను ఈనెల 20 నుంచి 26 వరకు ముంబైలోని సుప్రసిద్ధ ఆర్టిక గ్యాలరీ లో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ చివరి ఏడాది విద్యార్థి సాధు సోనీ దాస్ కు ప్రతిభ పురస్కారం లభించింది. ఇటీవల ఒరిస్సా ప్రభుత్వం ఒరిస్సాలోని కోణార్క్ లో ఉన్న చంద్రబాగ్ బీచ్ లో నిర్వహించిన అంతర్జాతీయ శాండ్ ఆర్ట్ ఫెస్టివల్ లో 11 దేశాల నుంచి 150 మంది విద్యార్థులు సైకత శిల్పాల పోటీలలో పాల్గొన్నారు. ఇందులో ఏఎన్ యు విద్యార్థి వాటుపల్లి గోపీచంద్ చేసిన వెంకటేశ్వర స్వామి సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రానికి ప్రతిభ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ప్రతిభను కనబరిచి వర్సిటీకి కీర్తి ప్రతిష్టలను పెంచిన సోనిదాస్, గోపీచంద్ లను వీసీ ఆచార్య కే గంగాధరరావు అభినందించారు. చాలా తక్కువ మంది కళాకారులు ఉన్న ఈ శాండ్ ఆర్ట్ లో వర్సిటీ విద్యార్థి ఉండటం అభినందనీయమని అన్నారు. . ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభకు అధ్యాపకులు దేవకాంత్, జాన్ రత్నబాబుల సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్ విద్యార్థులను అభినందిస్తూ అమరావతి రాజధాని చరిత్రను కళారూపాలుగా రూపొందించాలని కోరారు.



మెరుగైన ర్యాంక్ కోసం డేటా సమర్పణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2025 ఏడాదికి మెరుగైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించేందుకు డేటాను సమర్పించింది. శుక్రవారం వీసి ఆచార్య కే .గంగాధర రావు ఎన్ఐఆర్ఎఫ్ వెబ్ సైట్‌కు యూనివర్సిటీ డేటాను పంపారు. 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓవరాల్‌గా 97వ ర్యాంకు, యూనివర్సిటీ కేటగిరీలో 59వ ర్యాంకు, రాష్ట్ర పబ్లిక్ యూనివర్సిటీ కేటగిరిలో 20వ ర్యాంకు, ఫార్మసీ కళాశాలకు 63వ ర్యాంకు మొత్తం 4 కేటగిరీల్లో ర్యాంకులు రావడం జరిగిందని, ఈసారి వాటిని మించి మెరుగైన ర్యాంకు సాధించాలని వీసి ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చారు. ఆ క్రమంలో ఐ క్యు ఏ సి విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీ ర్యాంకింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రవి యూనివర్సిటీ డేటాను, ఫార్మసీ కళాశాల డేటాను, సిద్ధం చేయగా, ఇంజనీరింగ్ కళాశాల డేటాను ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ పుణ్య శేఖర్ సంయుక్తంగా నివేదికలను సిద్ధం చేశారు. ఆ నివేదికలను క్రోడీకరించి శుక్రవారం సమర్పించడం జరిగింది. ఈ యేడాది జూన్ లో విడుదలయ్యే ర్యాంకుల్లో యూనివర్సిటీకి మెరుగైన ర్యాంకు వస్తుందని ఈ సందర్భంగా విసి ఆకాంక్షించారు. వర్సిటీ విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలకు పరిగణలోని తీసుకుని ర్యాంకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహా చలం, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య పి. సిద్దయ్య ఆచార్య ఏ .ప్రమీలరాణి, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ కష్ణసత్య, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మాదల చైతన్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

జనచైతన్య శ్రేష్ట గ్రూప్స్ అధినేత మాదల చైతన్య జన్మదిన వేడుకలు శుక్రవారం గుంటూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టాభిపురంలోని అనురాగ్ ఓల్డేజి హోమ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైతన్య పాల్గొని వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. వికలాంగుడు యడ్లపల్లి కోటేశ్వరరావుకు కృత్రిమ కాలు కోసం రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేశారు. నిరుపేద విద్యార్థులకు ఒక ఏడాది విద్యకు అసరమైన ఖర్చులు అందజేశారు. రుద్ర చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.20వేలు ఆర్థిక సాయం, మహాప్రస్తానం వాహనం అందిస్తామన్నారు. అదే విధంగా టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధి కోసం మాదల చైతన్య రూ.25 లక్షలు చెక్కును అందచేశారు. కార్యక్రమంలో మాధవరావ్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో జిఎంసి అదనపు కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల కోసం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో 1000 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేస్తూ ప్రకటించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో పశ్చిమ నియోజకవర్గం ఏఈఆర్ఓ, జిఎంసి అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు శుక్రవారం జిఎంసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డ్రాఫ్ట్‌పై పార్టీల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. నిర్దేశించిన ఓటర్ల సంఖ్య దాటిని పోలింగ్ కేంద్రాలను అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఏఈఆర్ఓలు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు, డిప్యూటీ తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు, టిడిపి నాయకులు నాయుడు ఓంకార్, బిజెపి నాయకులు పాండురంగ విఠల్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్ కుమార్, సిపియం నాయకులు కె.నళినీకాంత్, ఆప్ నాయుకలు సేవాకుమార్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మతసామర్య దినం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నగరాలులో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజి వర్ధంతి సందర్భంగా మతసామర్యదినం నిర్వహింహించారు. ఈ సందర్భంగా బాలల సంఘం జిల్లా కోఆర్డినేటర్ పద్మ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, కావున ప్రతి ఒక్కరూ గాంధీ చెప్పినట్లుగా స్త్రీ, పురుష బేధాలు, కుల, మత బేధాలు లేకుండా జీవించాలన్నారు. ఏ మతం అయినా తోటి వారిని సోదర భావంతో చూడాలన్నారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, నరసింహా, బాలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఎస్.కె.సుభానీ, ప్రజానాట్యమండలి నాయకులు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తహశీల్దార్ గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేటలోని డి ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినుల సౌకర్యార్థం తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయించారు. రెండు రోజుల క్రితం పాఠశాలను పరిశీలించిన ఆయన బాలికలు గ్రౌండ్లో నేలపై కూర్చుని చదువుకోవటం గమనించారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన స్వతహాగా బాలికలు చదువుకునేందుకు వీలుగా గ్రౌండ్లో గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయించి వారితో మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని దానికి అనుగుణంగా శ్రమించాలని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బందం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎన్‌యూలో కార్యశాల బ్రోచర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో 'యోగా యాజ్ ఏ థెరపిటిక్ ఇంటర్వెన్షన్' అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్ తెలిపారు. ఈ నెల 12, 13వ తేదీల్లో జరిగే ఈ వర్క్‌షాప్‌నకు సంబంధించిన బ్రోచర్లను శుక్రవారం వీసీ ఆచార్య గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు, యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్స్ విజన్‌పై జాతీయ సదస్సు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22వ తేదీలలో 'అంబేద్కర్స్ విజన్ ఆన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫాక్టర్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు.



ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ జాతీయ సదస్సు కు పరిశోధన పత్రాలు పంపాలని ఆయన సూచించారు. సదస్సు కోశాధికారి డాక్టర్ కె.అబ్రహాం లింకన్, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, విభాగం పరిశోధకులు, సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘం పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశం అజెండాలోని నాలుగు అంశాలను ఆమోదించినట్లు ప్రకటించారు. వార్డుల్లో కొన్ని సమస్యలపై కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ బి.శేషన్న సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ తెనాలి పట్టణానికి ఉన్న ఆర్థిక వనరుల ద్వారా అనేక అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. రహదారులు, కాల్వల నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో కొందరు ఇళ్ల యజమానుల సహకారం కొరవడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. పట్టణ అభివృద్ధి విషయంలో అందరూ సహకరించాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, సహాయ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలో శుక్రవారం నరసరావుపేట ఎం.వి.రెడ్డి కంటి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 118 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 12 మందికి శుక్లాలు, అయిదుగురికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొనుగోటి సాంబశివరావు, గ్రామపెద్దలు వీర్ల సాంబయ్య, పొనుగోటి వెంకటేశ్వర్లు, జాగర్లమూడి నాసరరావు పాల్గొన్నారు.

తహసీల్దారుగా అర్జున్ నాయక్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రెంటచింతల



రెంటచింతల మండల తహసీల్దారుగా ఎం.అర్జున్ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బొల్లాపల్లి డీటీగా పని చేస్తూ, ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కరుణ్ కుమార్ పత్తిపాడుకు బదిలీ అయ్యారు. డిటి బ్రహ్మయ్య, ఆర్ఐ రామకృష్ణ తదితరులు నూతన తహసీల్దారుకు అభినందనలు తెలిపారు.

హెల్మెట్‌ధారణతో ప్రాణాలకు రక్షణ

ప్రజాశక్తి-పెదనందిపాడు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చుని పెదనందిపాడు ఎస్సై మధు పవన్ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు రహదారి ప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సై మధు పవన్ ఆధ్వర్యంలో హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు.

పశుపోషకుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పశుపోషకుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఒ.నరసింహారావు తెలిపారు. మండలంలోని నాగులపాడు గ్రామంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఏరియా వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.శైలజ, డాక్టర్ ఎం.అనిత వైద్యసేవలు అందించారు.



బాల్యవివాహాలను అరికడదాం.. బాలికలను చదివిద్దాం

ప్రజాశక్తి-పెదనందిపాడు

బాల్య వివాహాలను అరికడదామని.. ఆడపిల్లలను చదవిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం భేటీ బచావో.. భేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలమె మాట్లాడుతూ అక్రమ రవాణా నిషేధించడం, గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణకు వ్యతిరేకంగా చట్టం రూపొందించారని తెలిపారు. బాల్యవివాహాలు అరికట్టవలసిన ఆవశ్యకత గురించి వివరించారు. ఆడపిల్లలను చదివించడం వల్ల వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. వారి హక్కులను కాపాడతామని



ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బి.లక్ష్మి ప్రసన్న, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం మాధవి, ఉషారాణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అభిమానుల సమక్షంలో జన్మదినోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెలుగుదేశం పార్టీ 3వ వార్డు మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత నిమ్మకాయల వ్యాపారులు, ముఠా కార్మికులు కేకు ఏర్పాటు చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శివాజి చౌక్ కూడలిలో అన్నదానం నిర్వహించిన గుమ్మడి యువసేన తన అభిమాన నాయకుడి చేత భారీ కేకు కత్తిరించారు. తన మార్క్ రాజకీయలతో తెనాలి అభివృద్ధికి కషిచేసిన గుమ్మడి రమేష్.. ఎప్పటికీ ప్రజలు గుండెల్లో నిలిచిపోతారన్నారు. ఆయన మరోసారి రాజకీయ ప్రవేశం చేయాలని అభిమానులు ఆకాక్షించారు. కార్యక్రమంలో ఈదర వెంకట పూర్ణచంద్, బాధినేడి



బాబ్జీ, పులివర్తి సుధీర్, టి.బాలకష్ణ యాదవ్, జెమిని, ధూళిపాళ్ల కార్తీక్, చింతా హరి బాబు, ఆట్ల గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపైనా క్రీస్తు ఆశీస్సులు

ప్రజాశక్తి తెనాలిరూరల్

క్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని గుంటూరు జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండ ల పరిధి కొలకలూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన తెలుగు బాప్టిస్టు సంఘం 4వ వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.దైవసేవకులు నన్నెపాగ సురేష్ ప్రార్థనతో తొలుత కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రజలందరికి దేవుని కృపతో నూతన సంవత్సరంలో మంచి జరగాలని ఆకాంక్షించారు. గ్రామస్తులతో బాపిస్టు సంఘ వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ, సంఘ అధ్యక్షులు ఉన్నం ప్రేమయ్య, వైస్ ప్రెసిడెంట్ ఎ.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణపై వినతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పాత పద్ధతిలోనే ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్య డిగ్రీ పరీక్షలను నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి రాధాకృష్ణ మూర్తికి ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వి.రాజు బందెల నాజర్ వినతి పత్రాన్ని అందజేశారు.

తండ్రిని చంపిన కుమారుడు : కేసు నమోదు

ప్రజాశక్తి- ఈపూరు

నూజెండ్ల గ్రామానికి చెందిన గంగినేని వెంకటేశ్వర్లు.. తన తండ్రి గంగినేని కొండయ్య (85)ను ఈపూరు మండలం భద్రుపాలెం గ్రామం వద్ద నాగార్జునసాగర్ ప్రధాన కుడి కాలువలో తోసేసి హత్య చేశాడు. ఈ నేపథ్యంలో, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొండయ్య మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తీర్థయాత్రలకు వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెనాలి

రామేశ్వరం తీర్థయాత్రలకు వెళ్లిన వ్యక్తి అక్కడ గుండెపోటుకు గురై మృతి చెందారు. రూరల్ గ్రామం కొలకలూరుకి చెందిన తాళ్లూరు శ్రీనివాసరావు టెంట్ హౌస్ నిర్వహిస్తుంటారు. కొద్దిరోజుల క్రితం ఆయన తీర్థయాత్రకు వెళ్లాడు. రామేశ్వరంలో శుక్రవారం గుండెపోటు రావడంతో సహచరులు ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందాడు.

కులదూషణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తుళ్లూరు

కోర్టు పరిధిలో ఉన్న స్థలం రక్షణకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, హద్దు రాళ్లను దౌర్జన్యంగా పగులగొట్టడమే కాక, తనను కులం పేరుతో దూషించాడని ఓ వ్యక్తిపై స్థానిక దళితవాడకు చెందిన పేరం భాస్కరరావు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన దామినేని వీరేంద్ర తన స్థలాన్ని(ప్లాట్) రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, అతని వద్ద అప్పుగా తీసుకున్న డబ్బులను వడ్డీతో సహా ఇచ్చి తన ప్లాట్‌ను తిరిగి ఇచ్చేయాలని అడిగితే కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రహదారి ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల పట్టణంలోని కోడెల శివప్రసాదరావు కాలనీకి చెందిన షేక్ జిలానీ (26) ద్విచక్ర వాహనంపై నరసరావుపేట నుంచి మాచర్ల వెళుతుండగా దేచవరం మిద్దె వద్ద కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందినప్పటికీ, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.



మద్యం దుకాణంలో చోరీ


ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఖాజా గ్రామంలోని మద్యం దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామీణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు దుకాణంలోకి ప్రవేశించి, సుమారుగా రెండు లక్షల మేర చోరీ చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పొగాకు గోదాంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-పెదనందిపాడు

మండలంలోని అన్నారం గ్రామంలో నంగినేని చౌదరికి చెందిన పొగాకు గోదాంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. చిలకలూరిపేట నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే పొగాకు పూర్తిగా దగ్ధమైంది.





వచ్చేనెల 8 వరకు ఎన్నికల కోడ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, పల్నాడు జిల్లాలో ఇది వచ్చేనెల 8వ తేదీ వరకూ కొనసాగుతుందని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి అధికారులతో శనివారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు, ప్రకటనలతో ఉన్న క్యాలెండర్లను తొలగించాలని ఆదేశించారు. కూడళ్లలో రాజకీయ నాయకుల విగ్రహాలకు నిబంధనల ప్రకారం ముసుగులు వేయాలన్నారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు ముసుగులు వేయాల్సిన అవసరం లేదన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో వెయ్యికి పైగా ఓటర్లుంటే మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కేంద్రాల్లో లైట్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పనకు తహశీల్దార్లు, ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో మురళి, డీపీఓ భాస్కర్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి రమణారెడ్డి, పశు సంవర్ధక శాఖాధికారి కాంతారావు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి- మాచర్ల

ఎమ్మెల్సీ ఎన్నికలకు మాచర్ల రూరల్‌లో పోలింగ్ స్టేషన్ ఏర్పాటుపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ బి.కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.వేణుబాబు, ఎంపిడిఒ ఫణికుమార్ నాయక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో నీలంరాజుకు మొదటి బహుమతి

ప్రజాశక్తి - మాచర్ల



స్థానిక హనుమాన్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న కొమెర నీలంరాజు జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు జిమ్ కోచ్‌లు రాచమంటి ఆదివిష్ణు యాదవ్, షేక్ గౌస్‌మెహిద్దీన్ శుక్రవారం తెలిపారు. ఉత్తరాఖండ్‌లో 38వ జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో మాచర్లకు చెందిన కొమెర నీలంరాజు ప్రతిభ చూపాడన్నారు. తమ జిమ్ నుండి వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకున్న పలువురు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తుండగా వారికి ప్రభుత్వం నుండి మంచి ప్రోత్సహకాలు అందుతున్నట్లు చెప్పారు. నీలంరాజు ప్రస్తుతం గుంటూరు రైల్వేలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. నీలంరాజును వెయిట్ లిఫ్టింగ్ ప్రత్యేక కోచ్ రాచమంటి శివకేశవయాదవ్, జిమ్ సీనియర్ సభ్యులు గోగుల ఆంజిరెడ్డి, గాదే శ్రీనివాసరావు, పులుసు రఘునాథ్‌రెడ్డి, పొకల వెంకటేశ్వర్లు, అల్లం ఏడుకొండలు, రాము, డాక్టరు విష్ణువర్షన్ అభినందించారు.

నిర్వాసితులను విస్మరించిన ప్రభుత్వాలు

- హెలికాప్టర్లలో కాదు.. గిరిజనులతో ఉంటే సమస్యలు తెలుస్తాయి
- పోలవరం నుండి వచ్చిన జాతాకు పల్నాడులో ఘన స్వాగతం



జాతాకు స్వాగతం పలికిన అనంతరం ర్యాలీలో సిపిఎం శ్రేణులు.. ప్రజా నాట్యమండలి కళాకారుల గేయాలాపన (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోలవరం ప్రాజెక్టును నిర్వాసితుల ప్రయోజనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, వారికి పూర్తిన్యాయం చేయకుండా ప్రాజెక్టు పనులు మొదలు పెట్టడం తగదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు అన్నారు. నెల్లూరు జిల్లాలో ఆ పార్టీ రాష్ట్ర మహాసభ జరగనున్న సందర్భంగా పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈనెల 28న పోలవరం నుండి నెల్లూరు బయలుదేరిన పతాక యాత్ర జాతా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు శుక్రవారం చేరుకుంది. గుంటూరు రోడ్డులోని నరసరావుపేట ముఖద్వారం వద్ద జాతాకు సిపిఎం శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. జాతా నాయకులు రామారావు, సురేష్, సంతోష్ ,శాంతి కుమారి, నాగమణి, సంపూర్ణకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ సాదర ఆహ్వానం పలికారు. అనంతరం ర్యాలీగా వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. డి.శివకుమారి అధ్యక్షతన జరిగిన సభలో దడాల సుబ్బారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాక ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు దఫాలుగా వస్తున్న వర్షాలకు వరదలకు నిర్వాసితులు రక్షణ పొందేందుకు కొండలను గుట్టలను ఆశ్రయిస్తున్నారని, ప్రధాని, ముఖ్యమంత్రులు హెలికాప్టర్లలో చూసి వెళ్లడం కాకుండా ఒక్కరోజైనా నిర్వాసితులతో గడిపితే వారి బాధలు తెలుస్తాయని అన్నారు. సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు, మాజీ సిఎం జగన్‌కు రాజకీయ లబ్ధి మినహా రాష్ట్ర ప్రయోజనాలతో సంబంధం లేదని విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కోసం, దేశం కోసం నిస్వార్థంగా పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. బిజెపిలోకి వెళ్లే ఎత్తుగడలో భాగంగానే వైసిపికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారని అన్నారు. దేశంలో మతతత్వాన్ని పెంచి పోషిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ గిరిజనులను సైతం మత ఉచ్చులోకి లాగడానికి బిజెపి యత్నిస్తోందన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇప్పటి ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని, వారికి న్యాయం చేయకుంటే సిపిఎం పోరాటాన్ని ఉధృతం చేస్తుందని చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర మభాసభలో తీర్మానాలను ఆమోదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు కె.హనుమంతరెడ్డి, జి.బాలకృష్ణ, జి.ఉమశ్రీ, రజిని, మల్లీశ్వరి, దుర్గాబాయ్, నాగమ్మబాయ్, టి.మహేష్, బి.మహేష్, హనుమంతరావు, సిలార్ మసూద్, రబ్బాని, టిశ్రీను, హనుమంతరావు, కె.కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు

బాపట్ల జిల్లా ఎడ్ల జతలకు బహుమతులు

ప్రజాశక్తి - రెంటచింతల



కానుక మాత 175వ తిరుణాళ్ల సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎడ్ల పందేలు కొనసాగుతున్నాయి. శుక్రవారం న్యూ కేటగిరి బండలాగుడు ఎడ్ల పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శ్రీకృష్ణ చౌదరిఎడ్ల జతకు 3900.9 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల వెంకటేశ్వర్‌రెడ్డి ఎడ్ల జత 3900 అడుగులతో రెండోస్థానం, బాపట్ల జిల్లా ఉప్పుమాగులూరుకు చెందిన రవిశంకర్‌రెడ్డి ఎడ్ల జత 3300 అడుగులతో మూడోస్థానం, రెంటచింతల మండలం రెంటాలకు చెందిన డాక్టర్ హుస్సేన్ కోదాడ, పిన్నబోయిన అభిషేక్ యాదవ్ కంబైన్డ్ జత 3287.8 అడుగుల దూరంతో నాలుగోస్థానం, కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కొలుసు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు ఎడ్ల జత 3135 అడుగుల దూరంతో ఐదోస్థానం, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన ఎర్రం రాజశేఖర యశ్వంత్ ఎడ్లజత 2889 అడుగుల దూరంతో ఆరోస్థానం సాధించాయి. మొత్తం 10 ఎడ్ల జతలు పోటీలో పాల్గొనగా 9 జతలకు బహుమతులు ప్రదానం చేయగా, ఒక జతకు కన్సోలేషన్ బహుమతి అందించారు. కమిటీ సభ్యులైన వైఎల్.మర్రెడ్డి సుమంత్ రెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

భారాల తంతు.. రిజిస్ట్రేషన్ల వంతు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



ఇబ్బంటికే విద్యుత్, నిత్యాసరాల ధరల భారం మోస్తున్న ప్రజలపై ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ఛార్జీల పెంపుతో మళ్లీ భారాలు వేయబూనుకుంది. శనివారం నుండి రిజిస్ట్రేషన్ విలువను 8 నుంచి15 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ భారాన్ని తప్పించుకోడానికి.. భూముల కొన్నవారు అప్పులు చేసిమరీ శుక్రవారం రిజిస్ట్రేషన్లకు తరలివచ్చారు.

ప్రభుత్వం మారితే రియలెస్టేట్ ఊపందుకుంటుందని గతంలో ప్రచారమైనా ఆ పరిస్థితి ఏమీ కానరావడం లేదు. నిర్మాణ రంగమూ నిస్తేజంగానే ఉంది. వేగం పుంజుకునే సూచనలూ కనిపించడం లేదు. భూములు అమ్మడానికి ఎక్కువ మంది ఆసక్తిగా ఉన్నారేగాని కొనేవారు అంతంతమాత్రమే. రెండేళ్ల కిందట పరిస్థితే ప్రస్తుతమూ రియలెస్టేట్ రంగంలో నెలకొంది. జాతీయ రహదారి, బైపాస్ రోడ్ల పక్కన భూములకే కొద్దిమేర గిరాకీ పెరిగింది. చిలకలూరిపేట పరిధిలోని నరసరావుపేట రోడ్డు, చీరాల బైపాస్ సమీపంలో వేస్తున్న వెంచర్లలో సెంటు రూ.5 లక్షల వరకు ధరలున్నాయి. రియలెస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు హడావుడి చేసినా మార్కెట్‌లో కదలిక ఉండడం లేదు. కొనుగోళ్లు అంతగా లేకపోవడంతో రిజిస్ట్రేషన్లూ తగ్గుముఖం పట్టాయి. కొనుగోళ్లు, అమ్మకాల్లో చలనం, భవన నిర్మాణానికి ఊపు వస్తే మినహా ఈ పరిస్థితి మారే సూచనలు కనిపించడం లేదు. ఈ అంశాలను విస్మరించిన ప్రభుత్వం ఆదాయం రాబట్టుకోవడానికి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచడం ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిట

ఇదిలా ఉండగా శనివారం నుండి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుతాయనే ఉద్దేశంతో ఇప్పటికే భూముల కొన్నవారు వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి తరలివచ్చారు. పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం జనం, వాహనాలతో కిక్కిరిసింది. కూర్చోవడానికైనా వీల్లేకుండా పోయింది. సాధారణంగా రోజుకు 30-50 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అలాంటిది శుక్రవారం ఒక్కరోజే 150 రిజిస్ట్రేషన్లు వచ్చాయి. మరోవైపు సర్వర్లు వేగంగా పనిచేయకపోవడం, ఐరిస్, వేలిముద్ర యంత్రాలు పనిచేయకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. గురువారం కూడా ఇదే పరిస్థితి కనిపించడంతో రాత్రి 9 గంటల వరకూ పనులు చేస్తూనే ఉన్నారు.

అప్పులతో కాదు హక్కులతో రాజధానిని అభివృద్ధి చేయాలి

కేంద్రం అమరావతికిచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్

సిపిఎం రాష్ట్ర మహాసభలకు నెల్లూరు తరలి వెళ్లిన రాజధాని జాతా - అడుగడుగునా ఘన స్వాగతం


పొన్నూరులో మాట్లాడుతున్న ఎం.రవి


తెనాలిలో ప్రసంగిస్తున్న వై.నేతాజీ


నారాకోడూరులో మాట్లాడుతున్న వై.నేతాజీ

ప్రజాశక్తి-తెనాలి, చేబ్రోలు

రాజధాని అభివృద్ధి పేరిట ప్రపంచ బ్యాంకు నిధులు అప్పులు తెచ్చి ఆ భారాన్ని ప్రజలపై వేయటం సరికాదని, కేంద్ర ప్రభుత్వం నుంచి హక్కుగా నిధులు రాబట్టి రాజధానిని అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో జరుగునున్న మహాసభల నేపథ్యంలో రాజధాని అభివృద్ధి నినాదంతో తాడేపల్లి నుంచి బయలుదేరిన జాతా శుక్రవారం తెనాలి, చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో పర్యటించి ప్రకాశం జిల్లా బాపట్లకు చేరింది. తెనాలి ఏరియా కార్యదర్శి కె బాబు ప్రసాద్ సారథ్యంలో జాతాకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అన్నాబత్తుని పుర వేదిక వద్ద జరిగిన సభలో నేతాజీ మాట్లాడుతూ నెల్లూరులో జరిగే మహాసభలలో రాజధాని ప్రాంత ప్రజలు, రాష్ట్రంలో సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై చర్చ జరగనుందన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజధాని అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరగాలని, అదే సమయంలో ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యతనివ్వాలన్నారు. గత ప్రభుత్వం లాగా రాజధాని మార్పు ప్రస్తావన భవిష్యత్తులో రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ వంటి హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం పోరాటం చేస్తుందని తెలిపారు. బాబు ప్రసాద్ మాట్లాడుతూ సిపిఎం ఆధ్యర్యంలో ఎన్నో పోరాటాలు జరిగాయని, ఎందరో ప్రాణత్యాగం ఫలితంగా రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చాయన్నారు. సభలో జాతా సభ్యులు ఎం రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భవన్నారాయణ, ములకా శివ సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, ఎం శివ కుమారి, ఎన్ రాజ్యలక్ష్మి, జి వెంకటసుబ్బయ్య, కె.శ్రీనివాసరావు, జి రవీంద్ర, కె దుర్గాప్రసాద్, షేక్ బాజీ, షేక్ ఆశాబీ, ఎస్ సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, బి సుబ్బారావు పాల్గొన్నారు.

నారాకోడూరు సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండాలక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వవలసిన నిధులు ఇవ్వకుండా అడ్డుతగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న టిడిపి ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు సొంత గనుల కేటాయించకుండా విశాఖ ఉక్కును సహజ మరణానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక నిర్ణయాలలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వాములవ్వడం వల్ల ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు అంటూ ప్రచారం నిర్వహించి ఎన్నికలు అయిపోయిన తర్వాత కూటమిబాదుడు ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వసంత కుమారి, షార్పుద్దిన్, నరసింహారావు, చింతల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొన్నూరు జాతాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం రవి మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పదివేల కోట్ల రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు గతంలో విజన్ 20-20 అని ప్రచారం చేశారని, మరలా ఇప్పుడు అధికారంలోకి వచ్చాక విజన్ 2047 అని ప్రచారం చేస్తున్నారు తప్ప, ఆ విజన్ వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా సాధారణ ప్రజల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటారో ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ, శాఖ కార్యదర్శి బోనిగల ప్రభుదాసు, నాయకులు ఎన్ రమేష్ బాబు, రాం బ్రహ్మాచారి, బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఉమ్మడి కృష్ణ-గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజక వర్గానికి ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికలకు సంబంధించి స్థానిక ఆంధ్రా క్రైస్తవ కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే గదులు, రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎస్. నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజతో కలసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నుండి ఏ.సి కళాశాలకు వచ్చే వాహనాలు, తిరిగి వెళ్ళే వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. రిసెప్షన్ కౌంటర్ల వద్ద బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, వాటిని సంబంధిత గదులకు తరలించే మార్గాల్లో బారీకేడింగ్ ఏర్పాట్లు పకడ్బంధీగా చేపట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని, పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి షేక్. ఖాజావలి, ఆర్డిఓ కె. శ్రీనివాసరావు , జీయంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, గుంటూరు తూర్పు మండల తహశీల్దార్ నగేష్ , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను తొలగించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - మంగళగిరి


సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి పట్టణంలోని నాలుగో వార్డ్ లో ఫారెస్ట్ భూముల్లో ఇళ్లు వేసుకుని పేదలకు నివాసం ఉంటున్నారని, అభ్యంతరాలు తొలగించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇచ్చిన సర్టిఫికెట్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నాలుగో వార్డు సచివాలయ అధికారులకు సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరించి వినదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ 40 సంవత్సరాలు పైగా పేదల కొండ పొరంబాకులో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నారని వారికి వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ప్రభుత్వ భూముల్లో, కొండపొరంబాకు భూముల్లో ఇల్లు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఫారెస్ట్ భూములకు ఉన్న అభ్యంతరాలను తొలగించాలని కోరారు. రాజధానిలో ఇళ్ల స్థలాల పేరుతో గత ప్రభుత్వం సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జే బ్రాహ్మణి, ఈగ సాంబయ్య, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎఇఎస్ఎ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు : ఎపిఎఇఎస్ఎ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం ఎపిఎఇఎస్ఎ జిల్లా కార్యవర్గ ఎన్నికలు స్థానిక ఎన్జిఒ హోంలో నిర్వహించారు. డిఎస్ఎన్ శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా , వి.రమేష్ సహాయ ఎన్నికల అధికారిగా, పాపారావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో ఎం.శ్రీనివాసరావు జిల్లా అధ్యక్షునిగా, కె.రామ్మోహన్‌రావు జిల్లా కార్యదర్శిగా, షేక్.అజిముల్లా జిల్లా కోశాధికారిగా, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు పాల్గొని నూతన కమిటీని అభినందనలు తెలిపారు. అలాగే ఎపిఎఇఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు సాయి కుమార్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి శ్యాంసుందర్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు


డిసిఎల్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

చనిపోయిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఆర్టీసీ కాలనీలో పెయింట్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు భవనంపై నుండి కింద పడి చనిపోయిన పెయింట్ వర్కర్ బురదగుంట్ల ప్రేమ్‌కుమార్‌కు కుటుంబాన్ని ఆదుకోవాలని గుంటూరు భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) నాయకులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రమాదంలో తలకు బలమైన గాయం ఏర్పడి, జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ జనవరి 22న చనిపోయాడని తెలిపారు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారన్నారు. భార్య అనారోగ్యం పాలైందన్నారు. వారి కుటుంబాన్ని ఆదుకునే వారు ఎవరూ లేనందున చనిపోయిన వారి కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో భవనిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి షేక్.ఖాసింవలి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి దీవెనరావు, పశ్చిమ కమిటీ అధ్యక్షులు దొడ్డ కోటేశ్వరావు, సిఐటియు నాయకులు ఇల్లూరి బాబురావు, పి.విమల్‌కుమార్ తదితరులున్నారు.

చలపతిలో ముగిసిన ఎథికల్ హ్యాకింగ్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న ఇవాన్‌వాస్

లాంలోని చలపతి ఇంజినీ రింగ్ కాలేజిలో ఎథికల్ హ్యాకింగ్‌పై పది రోజుల శిక్షణ ముగిసింది. ఈ శిక్షణకు ముఖ్య అతిథిగా సెక్యూరిమ్ సొల్యూషన్స్ ఇసి కౌన్సిల్ సభ్యులు ఇవాన్‌వాస్ హాజరై హ్యాకింగ్ గురించి మెళకు వలు నేర్పించారు. విద్యార్థులతో ల్యాబ్‌లో ప్రాక్టీస్ చేయించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వ్యక్తిగత సమాచారాన్ని, దేనినైనా ఎలా క్రియేట్ చేయాలో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, జె.భార్గవ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేశారు.

ఎన్నికల నియమావళి అమలుకు సహకరించాలి

ప్రజాశక్తి -గుంటూరు

కృష్ణ-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జనవరి 29వ తేది నుండే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున నగరంలో ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలుకు పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయాల వారీగా వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులను పట్టణ ప్రణాళిక విభాగ ఆధ్వర్యంలోని దళం బృందాలు తొలగిస్తున్నాయన్నారు. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను ముసుగులతో కప్పివేయడం జరుగుతుందని, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. జిఎంసి తరపున కొత్తగా అభివద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదన్నారు. నగరంలో ఎన్నికల నియమావళి అమలుకు పట్టణ ప్రణాళిక అధికారులు భాధ్యత తీసుకోవాలని, విధుల్లో ఎక్కడా నిర్లిప్త వైఖరి ఉండడానికి వీలు లేదని స్పష్టం చేశారు.

అభివృద్ధిలోనూ రాష్ట్రం ముందంజ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మాచర్ల

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అక్షర క్రమంలోనే కాకుండా అభివృద్ధి పథంలోను దూసుకుపోతోందని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పెనుగొండ క్షేత్రంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఆర్య వైశ్య కులానికి పెద్ద పీట వేశారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆర్యవైశ్య సంఘ నేతలు కజ్జం సైదయ్య, సూరే యలమంద, కంభంపాటి అనిల్ కుమార్, పోలిశెట్టి అనంత శ్రీనివాసరావు, పోలిశెట్టి శ్రీహరిరావు, భవనాశి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతరావు, రంగా సత్యనారాయణ, తిరివీధుల నాగేశ్వరావు, భవనారి రవితేజ, పోలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి రూరల్ : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టణంలో వేంచేసి ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా ఎమ్మెల్యే కన్నా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు కాశీ విశ్వనాథం, బచ్చు కొండలు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కన్నా



పశుపోషణతో మరింత ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - యడ్లపాడు

రైతులు వ్యవసాయంతోపాటు పశుపోషణ జీవనాధారంగా చేసుకొని, మరింత అభివృద్ధి చెందాలని ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణ సూచించారు. పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం జగ్గాపురం గ్రామంలో స్థానిక పశు వైద్యాధికారిణి పి.కిరణ్మయి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పసుపోషకులకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 196 దూడలకు నట్టల నివారణ మందులు, 32 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 42 పశువులకు చూడు, 18 సాధారణ చికిత్సలు చేశారు. 12 కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, 156 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందించారు.



రైతు బాంధవుడు సాంబయ్య

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాజీ ఎమ్మెల్యే, దివంగత సోమేపల్లి సాంబయ్య రైతు బాంధవునిగా ఖ్యాతి గడించారని శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ అన్నారు. సాంబయ్య 25వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సాంబశివ నగర్, భాస్కర్ సెంటర్, తాతపూడిల వద్ద ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. చిలకలూరిపేటలో 200 ఎకరాలలో మంచినీటి చెరువును ఏర్పాటు చేయడం ఆయన కృషేనన్నారు. పలు గ్రామాల్లో ఎస్సీ కాలనీల ఏర్పాటుతోపాటు, అక్కడి వారికి నివేశన స్థలాలు ఇప్పించారని గుర్తు చేశారు.

ఆకట్టుకున్న మాస్టర్ చెఫ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక నారాయణ ఈ-టెక్నో పాఠశాలలో మాస్టర్ చెఫ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 300 మందికిపైగా విద్యార్థులు.. వారు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను పాఠశాలలో ప్రద ర్శించారు. వాటి తయారీ విధానం, ఉపయోగాలపై సందర్శకులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, ఏజీఎం లక్ష్మణరెడ్డి, కోఆర్డినేటర్ గౌసియా తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ లారీ బోల్తా

ప్రజాశక్తి-నకరికల్లు

అదుపుతప్పి పార్శిల్ లారీ బోల్తా పడిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న పార్శిల్ లారీ నకరికల్లులోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన పోలీస్ స్టేషన్ మూలమలుపు వద్ద గ్రిల్స్‌ను గుద్దుకొని, సర్వీసురోడ్డుపై బోల్తా పడింది. ఎవరికీ ఏ ప్రమాదమూ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఇదే మలుపు వద్ద రెండు లారీలు బోల్తాపడ్డాయి. మూలమలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వాన పరిస్థితులతో చదువులెలా : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని రైల్వే గేట్ సమీపంలో ఉన్న సుగాలి కాలనీ హైస్కూల్లో పారిశుద్ధ్య సమస్యలు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సత్తెనపల్లి మండల కార్యదర్శి డి.అమూల్య అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం సుగాలి కాలనీ హైస్కూల్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. సమస్యలపై విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాల భవనం వెనుక వైపు పనికిరాని మొక్కలు, చెత్త వల్ల పాములు సంచరిస్తున్నాయని విద్యార్థులు వివరించారు. మధ్యాహ్న భోజనంలో మిగిలిన అన్నం స్కూల్ ఆవరణలోనే పడవేస్తున్నారని, దీంతో అది దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం లతా ప్రియదర్శిని దృష్టికి అమూల్య తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారం రోజులలో పరిష్కారం అయ్యేటట్లు కృషి చేస్తానని హెచ్‌ఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సభ్యులు స్వరూప చంద్రిక, కమలాకర్ రావు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద అపరిశుభ్ర వాతావరణం

ముగిసిన పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో ఈ నెల 20 నుంచి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్యశిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున మండలంలోని పరగటిచర్ల, రొంపిచర్ల గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారులు ఆవుల సాయి మహేష్ రెడ్డి, వంశీ ప్రసాద్ పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 24 పశువైద్యశిబిరాలు నిర్వహించామని వివరించారు. మొత్తంగా 1,682 పశువులకు వైద్యం అందించామని చెప్పారు. 263 చూడి కట్టని ఆవులకు, గేదెలకు ప్రత్యేక చికిత్సలు చేశామన్నారు. 184 కత్రిమ గర్భధారణలు నిర్వహించామని తెలిపారు. 536 పశువులకు చూడి నిర్ధారణ చేశామన్నారు. ఈ శిబిరాల ద్వారా 1,753 మంది రైతులు లబ్ధి పొందారని వైద్యాధికారులు వివరించారు.

కృష్ణమూర్తి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి నాదెండ్ల

చిలకలూరిపేట ప్రాంత తొలి ఫొటోగ్రాఫర్, స్వాతంత్ర్య సమరయోధులు, నటులు, రాజకీయ నాయకులు ధూళిపాల శ్రీకృష్ణమూర్తి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని శ్రీకృష్ణమూర్తి స్వగహంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ డాక్టర్ జక్కంపూడి సీతారామారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ కందిమల్ల సాంబశివరావు, విశ్రాంత్ అధ్యాపకులు చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస కళ్యాణ్, అడిషనల్ సివిల్ జడ్జి పి.పార్థసారథి సూచించారు. మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బాలుర ఎస్టీ హాస్టల్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యా హక్కు చట్టం, బాలకార్మిక చట్టంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది వరప్రసాద్ పాల్గొన్నారు.

తీర్మానాలు లేకుండానే ముగిసిన సమావేశం

ప్రజాశక్తి-నకరికల్లు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.కాశయ్య మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తీర్మానాలు చేయడం కుదరదని తెలిపారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా గ్రామాలలో చేతి పంపులు, వాటర్ పైప్ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. పల్లె పండుగ పేరుతో ప్రభుత్వం రూ.2.78 కోట్లు నిధులను మండలానికి కేటాయించిందని తెలిపారు. డిప్యూటీ తాహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూముల రీ సర్వే పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద చాగల్లు, కండ్లకుంట గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నామన్నారు. మండల కో ఆప్షన్ మెంబర్ హుస్సేన్ మాట్లాడుతూ నకరికల్లు గ్రామంలో బంగ్లా గడ్డ బజారుకు మంచినీరు రావడంలేదన్నారు. ఆయుర్వేద వైద్యశాల శిథిలావస్థకు చేరుకుందని, దానిని మరోచోట నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్డీ కొమ్మవరపు శివప్రసాద్ పాల్గొన్నారు.



రెండు నెలల బకాయిలతో పింఛన్ల పంపిణీ : కమిషనర్

ప్రజాశక్తి - మాచర్ల



శనివారం ఉదయం 6 గంటల నుంచే పట్టణ పరిధిలో లబ్ధిదారులకు పింఛన్ మొత్తం పంపిణీ ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలో 6,382 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు. 105 మంది సచివాలయ సిబ్బందితో రూ.2కోట్ల 80లక్షల 27వేలు మొత్తం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్, డిసెంబర్ మాసాల్లో పింఛన్ తీసుకోని వారికి జనవరి నెలతోపాటు బకాయిలు చెల్లిస్తామని వివరించారు. సచివాలయ సిబ్బంది వచ్చే సమయానికి లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని కోరారు.

2న ఉచిత ఈఎన్‌టీ వైద్యశిబిరం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్థానిక శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ వద్ద ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నర్సరావుపేటకు చెందిన కొండవీటి హాస్పిటల్ సహకారంతో ఉచిత ఈఎన్‌టీ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఓపీడీ, స్కోప్ ద్వారా పరీక్షలు ఉచితంగా ఉంటాయన్నారు. రక్తపరీక్షల్లో, మందుల్లో ప్రత్యేక తగ్గింపు ఉంటుందని చెప్పారు. సర్జరీ అవసరమైన వారికి నర్సరావుపేటలో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సహాయం అందిస్తామన్నారు. మాచర్ల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజుపాలెం

శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని పొత్తూరి తిరుపతమ్మ, నరదాసు కళ్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.

'ఫీజు పోరు' గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఈ నెల 5న వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న 'ఫీజు పోరు' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను మాజీ మంత్రి విడదల రజని ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక ఎన్.ఆర్.టి సెంటర్లోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'ఫీజు పోరు' నిరసనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.



జాబ్ క్యాలెండర్‌పై మాట్లాడటం సిగ్గుచేటు : ప్రత్తిపాటి

ప్రజాశక్తి-చిలకలూరిపేట : గత ఐదేళ్లపాటు అవినీతి క్యాలెండర్ అమలు చేసిన వారు.. ఇప్పుడు జాబ్ క్యాలెండర్ కోసం మాట్లాడటం సిగ్గు చేటని వైసీపీ నాయకులనుద్దేశించి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పులారావు విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు, ఉ పాధి కల్పన దిశగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు.



రిజిస్టర్ కార్యాలయం వద్ద క్రయ, విక్రయదారులు

రద్దీగా సబ్ రిజిస్టర్ కార్యాలయం

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుండి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండడంతో మంగళగిరి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద క్రయవిక్రయాలకు సంబంధించిన రద్దీ బాగా పెరిగింది. గురు వారం రాత్రి 9 గంటల వరకూ రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిసింది. శుక్రవారమూ ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. ఎన్ని రిజిస్ట్రేషన్లు చేశారో చెప్పేందుకు అధికారులు నిరాకరించడం గమనార్హం.



సంఘు పెద్దలతో జడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టీనా

నూతన సంవత్సర వేడుకల్లో జడ్పీ చైర్ పర్సన్

ప్రజాశక్తి- తెనాలి

నూతన సంవత్సరం వేడుకలను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహక కమిటీని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా సంస్థ మేనేజర్ సుద్దపల్లి నాగరాజు, సంఘ కాపరి సురేష్, చర్చి కమిటీ బందం వి ప్రేమయ్య, కె చలమయ్య, ఎ.చిట్టిబాబు, వి.ధర్మారావు, ఎస్ మోషె, ఎస్ జాన్ బాబు పాల్గొన్నారు.



బత్తుల కిషోర్



కొప్పుల శేషగిరిరావు

తుళ్లూరు వైసిపి నాయకులకు పార్టీ పదవులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు గ్రామానికి చెందిన బత్తుల కిషోర్‌ను వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. గతంలో ఆయన మండల వైసిపి అధ్యక్షునిగా పని చేశారు.దొండపాడుకు చెందిన కొప్పుల శేషగిరిరావు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించబడ్డారు. వీరిని వైసిపి నాయకులు ఆరేపల్లి జోజి, గంజిమాల కోటేశ్వరరావు, కొప్పుల బాలస్వామి, శంగారపాటి సాంబయ్య, కొప్పుల అంద్రెప్ప, సరిగల శ్రీను అభినందించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా వజ్రబాబు(డైమండ్ బాబు) కు కిషోర్, శేషగిరిరావు కతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నిబంధనావళిని ఆకళింపు చేసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రూపొందించిన నిబంధనావళి పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి ఆకళింపు చేసుకుని నోడల్ అధికారులు ఎన్నికల విధులు పకడ్బంధీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సూచించారు. శుక్రవారం కలక్టరేట్‌లో కృష్ణ-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నియమితులైన నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన మ్యాన్‌మేనేజ్మెంట్ , ట్రాన్స్‌పోర్ట్, శిక్షణ, మెటీరియల్ బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, కంప్లయింట్ల పరిష్కారం, లా అండ్ ఆర్డర్ ,



మాట్లాడుతున్న కలెక్టర్

పోస్టల్ బ్యాలెట్ల ముద్రణా , మీడియా కమ్యూనికేషన్ , స్వీప్ కమ్యూనికేషన్ ప్లాన్ , పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు , ఎలక్టోరల్ రోల్స్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, తదితర కమిటీలపై ఏర్పాటు చేసిన నోడల్ అధికారులు ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా చదివి , ఆ మేరకు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జేసీ ఎ.భార్గవ్‌తేజ , తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, డిఆర్ఒ ఖాజావలి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

59వ రోజుకు ఎసిసి కార్మికుల రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎసిసి కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారానికి 59వ రోజుకు చేరాయి. పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో దీక్షలను వేముల దుర్గారావు, కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఆకలి కేకలతో, మానసిక వేదనకు గురై ఇబ్బందులు పడుతున్న ఎసిసి కార్మికుల సమస్యను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరారు. చేతిలో చిల్లిగవ్వ లేక, అనారోగ్యానికి గురై, మానసిక వేదనతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లిన ఎసిసి కార్మిక కుటుంబాలు నేడు దయనీయ స్థితిలో నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల దుస్థితికి పాలక పక్షాలే కారణమన్నారు. గత 32 సంవత్సరాలుగా కార్మికులకు నష్టపరిహారం రావాల్సి ఉండగా ఏ ప్రభుత్వమూ న్యాయం చేయక పోగా నిర్లక్ష్య ధోరణి అవలంబించాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు న్యాయం జరుగుతుందని మంచి మెజారిటీతో అందలం ఎక్కిస్తే, కార్మికుల పట్ల గౌరవ మంత్రి నారా లోకేష్ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఏసీసీ కార్మికులకు నారా లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 59వ రోజు దీక్షలలో ఉప్పు చినరామయ్య, కే. ఆదినారాయణ, పిచ్చయ్య, వై.సాంబయ్య, బి.దానయ్య కూర్చున్నారు. దీక్షలకు సంఘీభావంగా కూరపాటి స్టీవెన్, బి.సూర్యప్రకాష్, రమాదేవి, టి.దుర్గభవాని, రమణ, వై.యెహొషువ, ఎస్.కే.భాష, నాగేశ్వరరావు, శారద, శారమ్మ, సామ్రాజ్యం, శివ నాగలక్ష్మి, దర్శి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరీక్షల నిర్వహణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి ప్రత్తిపాడు

ప్రతిపాడు మండల పరిషత్ కార్యాలయంలో నీటి నాణ్యత పరీక్షల సమాచార నిర్వహణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాటర్ ఎయిడ్ గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ నీటి నాణ్యత ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పరిమాణాల ప్రకారం ఉండాలన్నారు. ఆరోగ్య సంస్థ సూచించిన ప్రకారం లేనినీరు సురక్షితం కాదన్నారు. ఇవి వివిధ రోగాలకు కారణమవుతాయని తెలిపారు. నీటి నాణ్యత పరీక్షలను గ్రామస్థాయిలో క్రమంగా జరిపి, నీటి నాణ్యత ప్రాముఖ్యత గురించి గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. నీటి నాణ్యత పరీక్ష ప్రతి కుటుంబంలోని మహిళ నేర్చుకునే విధంగా ఫీల్డ్ టెస్టింగ్ కిట్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతి పంచాయతీకి నీటి



నీటి నాణ్యత కిట్ అందచేస్తున్న వాటర్ ఎయిడ్ టీ ప్రతినిధులు

నాణ్యత పరీక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమానికి ఈదుల పాలెం, తుమ్మలపాలెం, గొట్టిపాడు, మేడావరిపాలెం తిక్కిరెడ్డిపాలెం, మల్లయ్యపాలెం నుంచి సర్పంచ్, సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామనీరు, పారిశుధ్య కమిటీ సభ్యులు, ఎఫ్.టి.కె సభ్యులు వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు సాయి, సునీల్, సత్యవాణ, వేణు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి రూరల్

ప్రజా యుద్ధనౌక గద్దర్ 76వ జయంతి వేడుకలను శుక్రవారం రైల్వేస్టేషన్ సెంటర్లోని ఐక్యవేదిక రాష్ట్ర కాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గద్దర్ తన పాటలతో యువతను చైతన్య పరిచారని అన్నారు. 1985 కారంచేడులో జరిగిన మారణకాండను వ్యతిరేకిస్తూ గద్దర్ చేపట్టిన అనేక కార్యక్రమాలు యువతకు ప్రేరణగా నిలిచాయని తెలిపారు. గుండెల్లో దిగిన తూటాను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలపై విప్లవగళం విప్పారన్నారు. కార్యక్రమంలో షేక్ దుబాయ్ బాబు, కుర్రా జశ్వంత్ యాదవ్, కె జేసుబాబు, ఉన్నవ సాల్మన్, పెరికల అరుణ్‌కుమార్, సయ్యద్ ఖాది మస్తాన్, టి శరత్, షేక్ సిద్ధిక్, బడుగు రమేష్ పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటిస్తున్న సభ్యులు

8, 9 తేదీలలో 33వ జాతీయ నాస్తిక మేళా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రు చార్వాక ఆశ్రమంలో ఫిబ్రవరి 8 9 తేదీలలో 33వ జాతీయ నాస్తిక మేళాను నిర్వహిస్తున్నట్లు నాస్తిక సమాజం నాయకులు శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల నుండి పలువురు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని చెప్పారు. మొదటి రోజు ఉదయం 9 గంటలకు ఈ మేళ ప్రారంభమవుతుందనిన్నారు. 8వ తేదీన భవిష్యత్తు ఆలోచన పరుడు పెరియార్ తమిళనాడు నుండి ఆర్.తమిళ సెల్వన్ 'మతము మహిళలు' అనే అంశంపై నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి ' సైన్స్ మీదా .. మాదా' అనే అంశంపై రాయపూర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయ కుమార్ ప్రసంగిస్తారని చెప్పారు. భారతీయ నాస్తిక వాదం అనే అంశంపై, జి.భార్గవ, అభ్యుదయవాదులు 'తరగతి గదిని ఆసక్తికరంగా మార్చడం ఎలా' అనే అంశంపై, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి 'ఆదిమ మతాలు విశ్వాసాలు' అనే అంశంపై ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్ 'ఆహారం ఆరోగ్యం' అనే అంశంపై, హెల్త్ యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ కే.శంకర్, 'మతము మూఢనమ్మకాలు' అనే అంశంపై కన్నడ రచయిత కుంబారి వీరభద్రప్ప ఉపన్యసిస్తారని చెప్పారు. రెండవ రోజు 'భారతదేశంలో ఫాసిజం' అనే అంశంపై తెలంగాణ మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య, 'పెరుగుతున్న ఫాసిజం మన కర్తవ్యాలు' అనే అంశంపై రమేష్ పట్నాయక్, 'మనుధర్మమా రాజ్యాంగ ధర్మమా' అనే అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్ బాబు, 'మతము మతతత్వము' అనే అంశంపై బి రామయ్య, 'కుల నిర్మూలన' అనే అంశంపై కే. కృష్ణ, మాట్లాడతారని చెప్పారు. అదేవిధంగా అభ్యుదయ నాస్తిక హేతువాద పద్యాలాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. నాస్తిక మేళాను జయప్రదం చేయాలని కోరారు.



సోలార్ ప్యానల్స్ బ్రోచర్ ఆవిష్కరణలో మాణిక్యరావు

ముందుచూపు కలిగిన సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - తెనాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపు కలిగిన వ్యక్తి అని ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ చౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏవీఎం సోలార్ ఎంటర్‌ప్రయిజెస్‌ప్రారంభోత్సవంలో మాణిక్యరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 కాలంలో చంద్రబాబు నాయుడు మిగులు విద్యుత్ రాష్ట్రంగా చేశారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ విద్యుత్ రంగాన్ని మూతపడే విధంగా చేసిందన్నారు. ప్రస్తుతం ప్రజలపై భారం పడకుండా విద్యుత్ సంస్కరణలు తీసుకు రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో సోలార్ విద్యుత్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని చెప్పారు. సబ్సిడీ ద్వారా ప్రజల ఇళ్లపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేన మిగులు విద్యుత్‌ని ప్రభుత్వమే నేరుగా కొనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్‌లాగే ఉచిత సోలార్ ప్యాడ్స్ కూడా ఏర్పాటు చేయబోతుందన్నారు. సోలార్ విద్యుత్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అత్తోట చంటి, నలుకుర్తి రమేష్, కంచర్ల ఏడుకొండలు, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోయంబత్తూర్‌లో వర్క్‌షాప్‌నకు కమిషనర్ హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

కోయంబత్తూరు మున్సిపల్ కార్పోరేషన్‌లో నిర్వహిస్తున్న వర్క్‌షాప్, క్షేత్ర స్థాయి పరిశీలనలో గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అక్కడి కార్పొరేషన్‌లో అనుసరిస్తున్న తాగునీటి సరఫరా విధానం, అందుకు వినియోగిస్తున్న సాంకేతిక పద్ధతుల ద్వారా ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ తెలిపారు. అమృత్ 2.0 డైరెక్టర్ ఇషా కాలియా, అడిషనల్ సెక్రెటరీ డి.తారా ప్రజలకు త్రాగునీటి సరఫరాపై అవగాహన కల్పించే విధానం గురించి వివరించారన్నారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డిప్యూటీ అడ్వైజర్ డాక్టర్ రమాకాంత్ త్రాగునీటి సరఫరా అంశం గైడ్‌లెన్స్‌ని, డాక్టర్ కెపి.జయరాం కర్ణాటకలో 24/7 తాగునీటి సరఫరాపై వివరించగా, కోయంబత్తూర్‌లో దశలవారీగా తాగునీటి సరఫరాలో చేపట్టిన చర్యలను కమిషనర్ శివగురు ప్రభాకరన్ తెలిపారన్నారు. అనంతరం కోయం బత్తూరులోని ఏకెఎస్ నగర్‌లో త్రాగునీటి పైప్‌లైన్‌పై లీకులను వినూత్నమైన విధానంలో వేగంగా గుర్తించడం, చరణ్ నగర్‌లో ఆటోమేటిక్‌గా తాగునీటి సరఫరా, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్, కస్టమర్ రిలేషన్ మేనేజ్మెంట్ సెల్‌లను కమిషనర్ పరిశీలించారు.

హక్కులు కాపాడేందుకే బాలల సంక్షేమ, రక్షణ కమిటీ

ప్రజాశక్తి - తాడికొండ

బాలల హక్కులు కాపాడేందుకే బాలల సంక్షేమ, రక్షణ కమిటీ పని చేస్తుందని క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి. వెంకట్ అన్నారు. మండలంలోని పొన్నెకల్లు గ్రామంలో శుక్రవారం చైల్డ్‌రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యలో గ్రామ బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికల హక్కులు కాపాడటమే కమిటీ లక్ష్యం అన్నారు. ఆదరణ, రక్షణ కావలసిన బాలలను గుర్తించినప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి కాల్ చేయాలని లేదా డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌కు లేదా బాలల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలకు ముందుగా సమాచారం అందించాలని తెలిపారు. వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచి ఆదరణ, రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్ ఎస్.ఎమ్ షరీఫ్, విఆర్ఓ స్వర్ణలత, రవికాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జగదీష్, పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ వీడ్కోలు

ప్రజాశక్తి మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ వీడ్కోలు పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. మంగళగిరిలోని ఆరో బెటాలియన్ మైదానంలో శుక్రవారం జరిగిన పరేడ్‌కు రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఒక దశలో భావో ద్వేగానికి గురయ్యారు. తన జీవితంలో ఇవి ఉద్విగ్నభరిత క్షణాలన్నారు. ఇకపై యూనిఫామ్ ఉండడం టేనే భావోద్వేగంగా ఉందని చెప్పారు. సర్వీసులో చేరినప్పటి నుంచి అనేక సవాళ్లను చూశానని తెలిపారు. సంప్రదాయ పోలీసింగ్ నుంచి సాంకేతిక పోలీసింగ్ వైపు మారామని చెప్పారు. విపత్తుల సమయంలో పోలీసులు సాహసోపేతంగా పని చేశారని ప్రశంసించారు. ప్రభుత్వ సహకారం వల్లే పోలీసు వ్యవస్థను బలోపేతం చేశానని తెలిపారు. గంజాయి, చిన్నారులపై నేరాలు, సైబర్ క్రైమ్ విషయంలో చర్యలు చేపట్టామని వెల్లడించారు.నూతన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ పోలీసు శాఖపై ద్వారకా తిరుమలరావు చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. ప్రజల భద్రత కోసం అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేశారని చెప్పారు. రాష్ట్ర డీజీపీగా తన శక్తిమేర పని చేస్తానని తెలిపారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.


డిజిపి తిరుమలరావుకు ఘనంగా వీడ్కోలు పలుకుతున్న అధికారులు, సిబ్బంది

సెమిస్టర్ ఫలితాల్లో అభ్యుదయ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు మూడో సెమిస్టర్ ఫలితాల్లో అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజి విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల డైరెక్టర్ బిఎస్ఆర్‌కె ప్రసాద్ తెలియజేశారు. మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, సిఎస్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, బిసిఎ, మల్టీ మీడియా, బి.కాం విద్యార్థినులు యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులతో ప్రతి చూపారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థినులకు డైరెక్టర్లు ప్రసాద్, బి.రోహిణీదేవి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టరు

చిప్స్ కాలేజిలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ వెంకటరమణ, విద్యాధర

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో నిర్వహించిన రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎపిటిఐ ప్రెసిడెంట్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఫార్మసీ రంగంలో పెనుమార్పులు తీసుకొస్తుం దన్నారు. దానిని సక్రమమైన మార్గంలో నడిపించి అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర, ఎపిటిఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.అంకమ్మ చౌదరి, సెక్రెటరీ డాక్టర్ డి.నేరంద్ర, ఎంఎం ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు ప్రసంగించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

అట్టహాసంగా బాల మహోత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొదటిసారి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాలమహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులచే 'విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25'లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ చిన్నారులు మొబైల్‌ఫోన్‌ను సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలని, జంక్ ఫుడ్ తినకుండా సంప్రదాయ వంటలను మాత్రమే తీసుకోవాలని అన్నారు. రోజూ గ్రౌండ్‌లో ఆడు కోవాలన్నారు. శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసికంగానూ బలంగా ఉంటారన్నారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ జీవితంలో కష్టపడి పని చేస్తే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని అన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, రన్నింగ్, మ్యూజిక్, డాన్స్ లిటరరీ, ఫైన్‌ఆర్ట్స్ విభాలలో దాదాపు 50 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.


రన్నింగ్ పోటీల్లో విద్యార్థులు

నూతన విద్యావిధానంతో..

దూరమవుతోన్న విద్య

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలు అనుసరిస్తున్నాయని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు షేక్.సమీర్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి పిల్లవాడికీ విద్యను అందించాలని రాజ్యాంగంలో రాసుకున్నామని, కానీ రాజ్యాంగం ఆమోదిం చుకొని 75 ఏళ్లు పూర్తి అయినా ఇంత వరకూ లక్ష్యం నెరవేరలేదని, ఇప్పటికీ లక్షల మంది బాల కార్మికులు పనిచేస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం విద్యా వ్యాపారాన్ని మరింత ప్రోత్సహిస్తుందని, విద్యపై రాష్ట్రాల హక్కులను కుదిస్తూ, కేంద్రం పెత్తనం పెంచుకుందన్నారు. యూనివర్సిటీల నియామకంలో రాష్ట్రాలకు ఉన్న హక్కులను తొలగించి గవర్నర్లకు అప్పగించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యారంగంలో మార్పు వస్తుందని ఆశించారని, కానీ ఏమీ మార్పు లేదన్నారు. 20 యూనివర్సిటీలకుగాను 18 యూనివర్సిటీలకు వీసీల నియామకం చేయలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీసీల నియామకం చేపట్టాలన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జిఒ 77, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే జిఒ 117ను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. డిఎస్‌సి ఎప్పుడు ఇస్తారో స్పష్టత లేదన్నారు. గతేడాది నవంబర్‌లోగా నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వాయిదాలు వేస్తుందన్నారు. లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని, తక్షణమే డిఎస్‌సిపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. యూని వర్సిటీ లలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్య, అందరికి విద్య, చదువుకున్న వారికి ఉపాధి లక్ష్యంగా 55 ఏళ్ళుగా ఎస్ఎఫ్ఐ కషి చేస్తుందన్నారు. దాన్ని మరింత వ్యాపారం చేయటానికి, మతోన్మాద భావాలను జొప్పించటానికి కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానం రూపొందించిందన్నారు. ప్రఖ్యాత హిందూ బెనారస్ యూని వర్సిటీలో చిలకజోస్యం కోర్సు పెట్టారని, యుపిలోని బిజెపి ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో గాంధీ సహజ మరణం పొందారని రాశారన్నారు. దేశం కోసం పోరాడిన భగత్‌సింగ్ గురించి పాఠ్య పుస్తకాల్లో తొలగించి, దేశ ద్రోహి సావర్కర్ గురించి రాస్తున్నారని తెలిపారు. నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన సహాసభలో విద్యారంగంలో నెలకొన్ని సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు కె.నవిత, సహాయ కార్యదర్శి యశ్వంత్, బి.సౌమ్య, పవన్, సుభాష్ పాల్గొన్నారు.

నగరంపాలెం పోలీస్ స్టేషన్ రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ డిఎస్‌పి కె.అరవింద్ శుక్రవారం నగరపాలెం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు స్టేషన్ లోని సిబ్బంది అంతా కృషి చేయాలని అన్నారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు రోజూ పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డయల్ 112కు వచ్చే ఫిర్యాదు లపై వేగంగా స్పందించాలన్నారు. సిసి కెమెరాలు అవశ్యకత గురించి ప్రజలకు, వ్యాపారు లకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపక్కన మద్యం సేవించి ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ఉన్న అనుమానిత రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రతివారం కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు. వెస్ట్ సబ్ డివిజన్‌లో గంజాయి, మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలకు తెరలేపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డిఎస్‌పి అరవింద్

ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రోత్సహించాలి

పీపుల్స్ లిటరేచర్ అండ్ కల్చరల్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిబాబు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, నిర్బంధ, అణచివేత రాజకీయ పాలనకు, సనాతనం పేరుతో తిరోగమన పతన సంస్కృతిని ప్రోత్సహిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భావసారూప్య ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడానికి సమయం ఆసన్నమైనదని ఆలిండియా పీపుల్స్ లిటరేచర్ అండ్ కల్చరల్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు అన్నారు. స్థానిక ఎన్‌జిఒ అసోసియేషన్ సమావేశ మందిరంలో అఖిల భారత ప్రజాసాహిత్య, కళా సాంస్కృతిక సభలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. వివిధ రాష్ట్రాల ప్రజా కళాకారులు డప్పుల, గజ్జల దరువుల దరువుతో స్వాగతించారు. ఏఐపిఎల్‌సిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శనను ప్రముఖ చిత్రకారులు టి.వెంకట్రావు ప్రారంభించారు. ఏఐపిఎల్‌సిఎఫ్ నాయకులు రమణ ప్రసాద్ అధ్యక్షత వహించిన సభలో తొలుత 'పీపుల్స్ లిటరేచర్' 11వ సంచికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఐదున్నర దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదం సాహిత్య కళారంగాలలో కూడా ఆధి పత్యం సాధించి అభివద్ధి చెందుతున్న ప్రగతిశీల, సాహిత్య, సాంస్కృతిక, ప్రజా విప్లవ ఉద్యమాలపై తమ ప్రభావాన్ని చాటుకుంటున్నదన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ముంచుకొస్తున్న ఆర్థిక, సామాజిక, సాహిత్య, కళా, సాంస్కృతిక దోపిడీలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల గొంతుకగా అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక బలమైన ప్రత్యా మ్నాయ సంస్థగా కషి చేస్తుందని వివరించారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, సిఎస్ఆర్ ప్రసాద్, కాట్రగడ్డ దయానంద్, గౌతమ్ ముఖర్జీ, సుగధన్‌పాల్ ప్రసంగించారు. ఆదివాసి నాయకులు రాంజీగోల్డ్ జీవిత చరిత్రపై ఆదివాసి చిన్నారులు ప్రదర్శించిన 'బుడతల బుర్రకథ', శ్రీకాకుళోద్యమ గిరిజన పోరాట చరిత్రపై డాక్యుడ్రామ ' పోరుదారి' ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని జనసాహితి ప్రధాన కార్య దర్శి డాక్టర్ బి.అరుణ పర్యవేక్షించగా, జాతీయ ఉపాధ్యక్షులు దివికుమార్ పాల్గొన్నారు.



పీపుల్ లిటరేచర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొత్తపల్లి రవిబాబు తదితరులు